క్లుప్తంగా

సూర్యగిరి ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకలంకరణలో అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మకు శ్రావణ మాసం చివరి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు ఉదయం నుంచే క్యూలో ఉన్నారు. ప్రత్యేకలంకరణ చేశారు. భక్తులు బోనాలతో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక శ్రీసత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు. నాగదేవతకు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావు, సిబ్బంది మీగడ కాశీనాథ్, అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ ఆశ్రమానికి దుప్పట్ల పంపిణీ



అనాథలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కౌశిక్‌గౌడ్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లోని మాతృదేవోభవ అనాథ, మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో మంగళవారం నాదర్‌గుల్‌కు చెందిన అంకంగారి కౌశిక్‌గౌడ్ జన్మదిన వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా 150 మంది మానసిక దివ్యాంగులకు దుప్పట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంకంగారి మంజుల, కుమార్‌గౌడ్, నర్సింహారెడ్డి, కొమురయ్యయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, భానుప్రకాశ్, ఎస్.భూపాల్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, సాయికృష్ణ, జె.విష్ణువర్ధన్‌యాదవ్, ఆశ్రమ నిర్వాహకులు గట్టు గిరి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు



బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడలో మంగళవారం ఎల్లమ్మతల్లి బోనాలను ఘనంగా నిర్వహించారు. డప్పుచప్పుళ్లు, పోతురాజుల విన్యాసాల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

కాసానికి శుభాకాంక్షలు



కాసానికి శుభాకాంక్షలు తెలుపుతున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

కందుకూరు: ముదిరాజ్ మహాసభ నేత కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ పుట్టినరోజును పురస్కరించుకొని పలువురు నాయకులు మంగళవారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్, వనపర్తి, నల్లగొండ జిల్లాల ముదిరాజ్ సంఘం ఇన్‌చార్జిలు కుర్నమోని జయేందర్‌ముదిరాజ్, కాకి దశరథముదిరాజ్, కొర్వి సురేందర్‌ముదిరాజ్, కాకి రాములుముదిరాజ్, బాబురావుముదిరాజ్, మండల సంఘం అధ్యక్షుడు పిట్టల పాండుముదిరాజ్, యూత్ అధ్యక్షుడు కాకి మధుసూదన్‌ముదిరాజ్, సురేశ్‌ముదిరాజ్, ఢిల్లీ యాదయ్యముదిరాజ్ పాల్గొన్నారు.

కష్టపడితే విజయం ఖాయం

నాగోలు: కష్టపడితే ప్రతి రంగంలో విజయం సాధించవచ్చని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బ్రాహ్మణ సమాజం, సంఘాలను ఏకం చేయడంలో(బ్రాహ్మిన్స్ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సరీ్వస్) బాస్ కృషి అభినందనీయమన్నారు. నాగోలు డివిజన్ బండ్లగూడలోని వసంత్ విహార్‌లో బాస్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి రామచంద్రరావుకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా రామచందరావు మాట్లాడుతూ..20 ఏళ్ల క్రితం ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో విశిష్ట అధికారులుగా బ్రాహ్మణులే ఉన్నారని గుర్తుచేశారు. బ్రాహ్మణులు ప్రభుత్వ రంగాల ఉద్యోగాలను ఎంచుకోవాలని పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలని సూచించారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

- అసంపూర్తిగా రహదారి విస్తరణ పనులు
- తవ్వి వదిలేయడంతో వర్షాలకు బురదమయం
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



మీర్‌ఖాన్‌పేట సమీపంలో బురదమయంగా మారిన రహదారి

కందుకూరు: రోడ్డు విస్తరణ చేపట్టడానికి తవ్వకాలు జరిపి సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణం పూర్తి చేయకపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై ఏర్పడ్డ గుంతల్లో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో నీరు నిలిచి అసౌకర్యంగా మారింది. దీంతో ఆ ప్రాంతంలో నివసించే ప్రజలు నానాపాట్లు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఇది మండల పరిధిలోని మీర్‌ఖాన్‌పేట పరిధిలో నెలకొన్న సమస్య.

మూడేళ్లయినా అసంపూర్తిగానే..

గత ప్రభుత్వ హయాంలో శ్రీశైలం రహదారి కొత్తూర్ గేట్ నుంచి కందుకూరు–మీర్‌ఖాన్‌పేట రోడ్డును కలుపుకుంటూ వావిళ్లకుంటతండా వరకు 200 అడుగుల విస్తీర్ణంలో ఫార్మా రహదారిని నిర్మించింది అప్పటి ప్రభుత్వం. అక్కడి నుంచి మీర్‌ఖాన్‌పేట, నస్దిక్ సింగారం మీదుగా నందివనపర్తి, యాచారం వరకు నాగార్జునసాగర్ రహదారిని కలిపే లింకు రహదారిని అభివృద్ధి చేసే క్రమంలో మూడేళ్ల క్రితం రోడ్డు విస్తరణ పనులు చేపట్టి పనులు ప్రారంభించారు. అక్కడక్కడ కల్వర్టులు నిర్మించి వదిలేశారు. రహదారి నిర్మాణంలో భాగంగా తవ్వి వదిలేయడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి వర్షపునీరు నిలిచి ప్రయాణం నరకంగా మారింది. దీంతో ప్రస్తుతం వావిళ్లకుంటతండా నుంచి మీర్‌ఖాన్‌పేట వరకు దాదాపుగా కిలోమీటర్ వరకు రహదారి అధ్వానంగా మారింది. మీర్‌ఖాన్‌పేట నుంచి నస్దిక్ సింగారం గ్రామం మధ్య మరో మూడు కిలోమీటర్లకు పైగా తవ్వి వదిలేయగా.. ఆ రహదారిపై ప్రస్తుతం అదే పరిస్థితి ఉంది. దీంతో గత నెలలో మీర్‌ఖాన్‌పేట గ్రామస్తులు రహదారిపై గుంతల్లో నిలిచిన వర్షం నీటిలో వరినాట్లు వేసి మరీ నిరసన తెలిపినా.. ఇంతవరకు అధికార యంత్రాంగంలో స్పందనేలేదు. రహదారి నిర్మాణం చేపట్టి మూడేళ్లు అవుతున్నా ఎందుకు పూర్తి చేయరని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేయాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు.

బురదమయంగా మారింది



రోడ్డు తవ్వి వదిలేయడంతో వర్షాలకు బురదమయంగా మారి అటు కందుకూరు వైపు ఇటు యాచారం వైపు వెళ్లాలంటే నరకం అనుభవించాల్సి వస్తోంది. రోడ్డు పనులు చేపట్టి ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. చాలా అవస్థలు పడుతున్నాం. అధికారులు వెంటనే పనులు ప్రారంభించాలి.

– కాకి రాములు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, మీర్‌ఖాన్‌పేట

అధికారులు పట్టించుకోవడం లేదు



రోడ్డు తవ్వి వదిలేయడంతో గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలంటే రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. పేరుకే ఫ్యూచర్ సిటీ అంటున్నారు కానీ ఇంతవరకు కనీసం గుంతల్లో మట్టి కూడా పోయడం లేదు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలి.

– జ్యోతిశేఖర్, మాజీ సర్పంచ్, మీర్‌ఖాన్‌పేట

విద్యుత్ సమస్యలపై ప్రత్యేక డ్రైవ్



జల్‌పల్లి రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని మారుస్తున్న సిబ్బంది

పహాడీషరీఫ్: నగరంలో వరుసగా చోటు చేసుకుంటున్న విద్యుత్ ప్రమాదాల నేపథ్యంలో పహాడీషరీఫ్ విద్యుత్ అధికారులు మంగళవారం ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. జల్‌పల్లి, శ్రీరాం కాలనీ, పహాడీషరీఫ్, వాదే ముస్తఫా తదితర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న స్టార్ వైర్లను తొలగించారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను గట్టిగా బిగించారు. అక్కడక్కడ ఒరిగిన విద్యుత్ స్తంభాలను కూడా మార్చారు. కందుకూర్ డీఈ గోపాలకృష్ణ పర్యవేక్షణలో మామిడిపల్లి ఏడీఈ శంకర్, పహాడీషరీఫ్ ఏఈ ఎల్.వీ.సత్యనారాయణ దగ్గరుండి ఈ పనులను చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా పౌరులు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలు, వైర్లకు ఐదడుగుల దూరం పాటించాలన్నారు. ఎక్కడైనా వైర్లు వేలాడినా, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదాలు పొంచి ఉన్నా ఫోన్ నం: 87124 70253కు సమాచారం ఇవ్వాలని ఏఈ సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న సంస్థ ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

మహేశ్వరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని ప్రిన్సిపాల్ డా.సంగి రమేశ్ అన్నారు. మొక్కలు నాటి భవిష్యత్తు తరాలను కాపాడాలని కోరారు. సంస్థ సభ్యులు మొక్కలు నాటడం, నాటించడం అభినందనీయమన్నారు. అంతకుముందు ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి సాత్విక, అధ్యాపకులు శ్రీహరిరెడ్డి, ఎన్ఎస్ఎస్ అధికారి జహేదాబేగం, శ్రీదేవి, గోపాల్, ఉపేందర్, రజనీకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

విగ్రహ విక్రయదారులకు కౌన్సెలింగ్



విక్రయదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ లక్ష్మణ్

పహాడీషరీఫ్: వినాయక విగ్రహాల విక్రయదారులు రోడ్లపై ప్రమాదాలు జరగకుండా సమయపాలన పాటించాలని పహాడీషరీఫ్ ఎస్ఐ లక్ష్మణ్ అన్నారు. సోమవారం రాత్రి బండ్లగూడలో వినాయక విగ్రహ తరలింపు సమయంలో విద్యుదాఘాతంతో ఇద్దరు యువకులు మృతి చెందిన నేపథ్యంలో మంగళవారం జల్‌పల్లి పరిసరాల్లో భారీ విగ్రహాల విక్రయ కేంద్రాల నిర్వాహకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. భారీ విగ్రహాలను ఒక వాహనం వెళ్లాక.. సమయం తీసుకొని మరొకటి వెళ్లేలా విక్రయాలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పగటి పూటనే విక్రయాలు చేపట్టాలని సూచించారు. ఈ ప్రాంతానికి కొత్తగా వచ్చేవారు రాత్రిపూట తరలించే క్రమంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. క్రేన్‌తో వాహనంపైకి విగ్రహాన్ని ఎక్కించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా భక్తులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరాలి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



ఉపాధి హామీ పనుల రికార్డులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం ద్వారా నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనులు ఏమి జరుగుతున్నాయి.. ఎలా నిర్వహిస్తున్నారు అని సంబంధిత అధికారి రమ్యను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో గల నర్సరీల్లో మొక్కలు ప్రజలకు పంపిణీ చేశారా అని ఎంపీడీఓ సంధ్యను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేయాలన్నారు. కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

21న పల్లెపల్లెకు బీజేపీ ప్రారంభం

చేవెళ్ల: బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రవాస యోజన (పల్లె పల్లెకు బీజేపీ) కార్యక్రమాన్ని చేవెళ్ల నుంచి ప్రారంభించేందుకు ఈ నెల 21న పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వస్తున్నట్లు మున్సిపల్, మండల అధ్యక్షులు అనంత్‌రెడ్డి, శ్రీకాంత్ తెలిపారు. చేవెళ్లలో మంగళవారం మండల కమిటీ ఆధ్వర్యంలో 21న నిర్వహించబోయే ప్రవాస యోజన కార్యక్రమం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మండల నాయకులు కార్యకర్తలతో కార్యక్రమం నిర్వహణపై చర్చించారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పల్లెపల్లెకు బీజేపీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం చేవెళ్ల నుంచి ప్రారంభం అవుతుందని, కావున పట్టణ నాయకులంతా కలిసిమెలిసి తరలివచ్చి విజయవంతం చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీ క్యాడర్‌లో ధైర్యం నింపేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని మల్కాపూర్ గేట్ వద్ద రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావుకు యువ మోర్చా ఆధ్వర్యంలో భారీ స్వాగతం పలుకుతారన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి, యువ నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, జైశంకర్, శర్వలింగం, రవీందర్‌రెడ్డి, ఇంద్రాసేనారెడ్డి, సత్యనారాయణ, అశోక్, ఉమాశంకర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ తిరుపతిరెడ్డి, సందీప్, కృష్ణ, గణేశ్, గోవర్ధన్, శ్రీనివాస్, జై సింహరెడ్డి, యోగేశ్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి నిరసన



వరదనీటిలో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి ఎఫ్‌సీఐ కాలనీలోని 50 ఫీట్ల ప్రధాన రోడ్డులో చిన్నపాటి వర్షానికే వరద రోడ్డుపైకి చేరి కుంటను తలపిస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారులతో మొర పెట్టుకున్నా స్పందించడం లేదని దీంతో మంగళవారం వరదనీటిలో నిలబడి నిరసన తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. నిరసనలో శ్రీనివాస్ రావు, నరసింహారావు, చంద్రశేఖర్‌రెడ్డి, రాజు యాదవ్, సత్యనారాయణ, మాలాద్రి, మధుకర్‌గౌడ్, వెంకటేష్ పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

మంచాల: మండల కేంద్రంలో నాయీ బ్రాహ్మణ సంఘం భవన నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు అశ్వల బాలరాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం తహసీల్దార్ ఎం.వీ.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 23 గ్రామ పంచాయతీల్లో ఉన్న నాయీ బ్రాహ్మణులు తమ సమస్యలపై పోరాటం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా తమ సంఘ భవనానికి ప్రభుత్వం స్థలం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు వెంకటేష్, రమేష్, జగన్, ఎం.వెంకటేష్, సురేష్, నర్సింహ, మహేష్, ముత్యాలు, యాదగిరి, రఘు, రాజు, రంజిత్, రాములు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు అధికారుల చర్యలు

షాద్‌నగర్: పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో ఉంచుకొని మున్సిపల్ అధికారులు మెయిన్ రోడ్డు విస్తరణకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం మున్సిపల్, హెచ్ఎండీఏ అధికారులు మెయిన్ రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా కొలతలు వేశారు. రోడ్డు విస్తరణ ద్వారా ప్రజలకు, వాహనదారులకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుందని, దానికి కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ సునీత స్పష్టం చేశారు.

ప్రైవేటు వాహనాలపై చర్యలు తీసుకోండి

శంకర్‌పల్లి: ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇష్టారీతినా రోడ్లపై తిరిగే ప్రైవేటు బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తెలంగాణ టూర్స్ అండ్ ట్రావెల్స్ బస్సు ఓనర్ అసోసియేషన్ సభ్యులు శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్‌కు వినతిపత్రం అందించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరకుమార్ మాట్లాడుతూ.. పట్టణంలోని పలు పాఠశాలల యాజమాన్యాలు ప్రైవేట్ బస్సుల ద్వారా పిల్లలను బడికి తీసుకొస్తున్నారని, వాటికి సరైన పర్మిట్‌లు, ట్యాక్స్ చెల్లింపులు, ఫిట్‌నెస్ సైతం లేవని ఆరోపించారు. దీనిపై ఇప్పటికే యాజమాన్యాలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

షాబాద్: మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని వెల్‌స్పన్ ఫౌండేషన్ సీఎస్ఆర్ హెడ్ కే.సురేఖ, మేనేజర్ భద్రయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హైతాబాద్, చిన్నపోలిపేట్ గ్రామాల్లో మహిళల కోసం జీవనోపాధి నైపుణ్య అభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 15 రోజుల పాటు వివిధ రకాల నైపుణ్యాలు, మార్కెట్ లింకేజీలు, ఉత్పత్తుల ప్రదర్శన, మార్కెటింగ్ చిట్కాలు వంటి అంశాలను నేర్పించనున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయిలో మహిళలు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ఉపాధిని పొందాలని సూచించారు. జిల్లా కో–ఆర్డినేటర్ ఖాసిం, రిసోర్స్ పర్సన్ శైలజ మహిళలకు జీవనోపాధిపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సిబ్బంది పవన్‌కుమార్, శ్వేత, హైతాబాద్ వీఓఏ కుమార్ తదితరులు ఉన్నారు.

అక్రమ మదర్సాను వెంటనే తొలగించాలి



సుల్తాన్‌పూర్‌లో స్థానికులతో కలిసి ధర్నా చేస్తున్న శ్రీరాములుయాదవ్

బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్

బడంగ్‌పేట్: అక్రమ మదర్సాపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల కన్వీనర్, బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సుల్తాన్‌పూర్‌లో అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాను ఎత్తి వేయాలని డిమాండ్ చేస్తూ స్థానిక హిందువులతో కలిసి ఆయన ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది కాలంగా అక్రమంగా నిర్వహిస్తున్న మదర్సాను ఎత్తివేయాలని బీజేపీ ఆధ్వర్యంలో బాలాపూర్ తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్నామన్నారు. అయినా ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి సంబంధం లేని రోహింగ్యాలు మదర్సాలో నివసిస్తున్నారని ఫలితంగా స్థానికంగా ఉన్నటువంటి హిందువులు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మదర్సాపై చర్యలు తీసుకునే వరకు ధర్నాను విరమించేది లేదని భీష్మించారు. ధర్నా స్థలానికి మహేశ్వరం ఏసీపీ జానకీరాంరెడ్డి చేరుకొని చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ కార్పొరేటర్లు, మహిళలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో రాణించాలి



క్రీడాకారులతో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

వనస్థలిపురం: వనస్థలిపురం స్కేటింగ్ రింగ్‌ను ఇండోర్ రింగ్‌గా మార్చడానికి కృషి చేస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం స్కేటింగ్ రింగ్‌లో నిర్వహించిన తెలంగాణ రోలర్ స్కేటింగ్ అండ్ ఇన్‌లైన్ హాకీ ఇండిపెండెన్స్ కప్ ముగింపు వేడుకల సందర్భంగా సోమవారం రాత్రి జరిగిన బహుమతుల పంపిణీ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, మల్లారెడ్డి, రామకృష్ణ, మనోహర్ పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా



కార్పొరేటర్‌ను సన్మానిస్తున్న కార్యవర్గ సభ్యులు

ఎల్‌బీనగర్: డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులు కల్పించి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీకి జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ సభ్యులు కార్పొరేటర్‌ను కలిసి కాలనీ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ..కాలనీలో రోడ్లు, విద్యుత్ దీపాలు, డ్రైనేజీ వంటి సమస్యలపై దృష్టి పెట్టి వాటి పరిష్కారిస్తానని కృషిచేస్తానన్నారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో అధ్యక్షుడిగా ఎన్నికైన సంజీవరెడ్డి, మాజీ అధ్యక్షులు జలందర్‌రెడి భూపాల్‌రెడ్డి పోచమ్మ ఆలయ చైర్మన్ శివకుమార్,యాదయ్య,శివయాదవ్, సత్యం రాంరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

మౌలిక సదుపాయాలకు పెద్దపీట

షాద్‌నగర్: ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 2వ వార్డులో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా వర్షాన్ని సైతం లెక్క చేయకుండా వార్డు పరిధిలో ఉన్న కాలనీల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు కావాల్సిన కనీస మౌలిక సదుపాయాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సీసీ రోడ్లు, అంతర్గత డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, మంచినీటి సదుపాయం వంటి కనీస సౌకర్యాల కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తుందన్నారు. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కొంకళ్ల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, శ్రీనునాయక్, భగవాన్‌దాస్, ముబారక్ తదితరులు పాల్గొన్నారు.